
సాక్షి ఒడిశా

బుధవారం । 14 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,59,823
బంగారం	800 మిల్లీ గ్రాములు
వెండి	31 గ్రాముల 450 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

వృద్ధురాలి చెవిదిద్దులు చోరీ



వృద్ధురాలి చెవిదిద్దులు తెంపుకుని వెళ్లిన యువతీ, యువకుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన రాయగడ జిల్లాలో చోటుచేసుకుంది.

- 8లో

ప్రజాభిప్రాయంతోనే మార్గదర్శకాలు



ప్రజాభిప్రాయంతోనే సుభద్ర యోజన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నామని డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడ మంగళవారం ప్రకటించారు.

- 8లో

న్యూస్‌రీల్

మహిళా రైతుకు అవార్డు



రొయిమతి ఘివురియ

జయపురం: సబ్ డివిజన్‌కు చెందిన మహిళా రైతు రొయిమతి ఘివురియకు న్యూఢిల్లీ చెందిన టైమ్స్ నెట్‌వర్క్ సంస్థ అమేజింగ్ ఇండియన్ అవార్డును ప్రకటించింది. ఈనెల 24వ తేదీన న్యూఢిల్లీ తాజ్ ప్యాలెస్‌లో ఆమెను అవార్డుతో సన్మానించనున్నట్లు ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పారిడ మంగళవారం వెల్లడించారు. దేశంలోని పలు రంగాల్లో విశేష సేవలందిస్తూ మంచి ఫలితాలు సాధించేవారికి టైమ్స్ నెట్‌వర్క్ అమేజింగ్ ఇండియన్ అవార్డుతో సన్మానిస్తుందని ఆయన తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంలో రొయిమతి ఘివురియ ప్రశంసనీయమైన ఫలితాలు సాధించినందుకుగాను అవార్డుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.


ఎలుగుబంట్ల స్వైర విహారం



ముంజ-చౌపాడి రహదారిలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ సమితి ముంజ, చౌపాడి గ్రామాల రహదారిలో పట్టపగలు ఎలుగుబంట్లు స్వైర విహారం చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ముంజ-చౌపాడి గ్రామాల రోడ్డుపై రెండు ఎలుగుబంట్లు సంచరిస్తుండగా ముంజ గ్రామంలోని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు వాటిని చూసి వెనుకకు పరుగులు తీశారు. కేవలం ముంజ-చౌపాడి రహదారిలోనే కాకుండా బిసింగపూర్ ప్రాంతంలో కూడా విచ్చలవిడిగా తిరుగుతున్నట్లు సమాచారం. నిత్యం ఇలాంటి ఘటనలే జరుగుతుండడంతో కొటాహండి, ఘటువాల్‌గుడ, చౌపాడి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవిలో ఆహార కొరత కారణంగా జంతువులు ఇలా గ్రామాల్లోకి వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలుగుబంట్ల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

తమిళనాడులో వలస కార్మికుడి మృతి



రమేష్ జొడియా (ఫైల్)

రాయగడ: ఉపాధి కోసం వలస వెళ్లిన మరో కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన మరోసారి చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి జిల్లాలోని కాసీపూర్ సమితి హడిగుడ పంచాయతీ లుచుగుడ గ్రామానికి చెందిన రమేష్(19)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. వృద్ధులైన తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా ఉండాలనే ఆశయంతో గ్రామానికి చెందిన కొంత మంది స్నేహితులతో కలిసి రెండేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రంలోని అమరాపండి ప్రాంతానికి రమేష్ ఉపాధి నిమిత్తం వెళ్లాడు. అక్కడ ఒక పౌల్ట్రీ ఫారంలో రోజుకూలీగా పని దొరికింది. దీంతో ప్రతినెలా తన తల్లిదండ్రులకు కొంత మొత్తం డబ్బులు పంపుతుండేవాడు. మధ్యమధ్యలో స్వగ్రామానికి స్నేహితులతో కలిసి వచ్చి కొన్ని రోజులు ఉండి వెళ్లేవాడు. ఈ క్రమంలో పనుల్లో ఉంటుండగా ఇటీవల అస్వస్థతకు గురయ్యాడు. అనంతరం పౌల్ట్రీ యజమానికి చెప్పడంతో సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాడు. కానీ అతడి ఆరోగ్యం మెరుగుపడక ఆదివారం రాత్రి రమేష్ తీవ్ర అస్వస్థతతో మృతి చెందినట్లు సమాచారం అందింది. దీంతో గ్రామంలోని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అయ్యారు. తమ కొడుకు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు సుమారు రూ.65 వేలు ఖర్చవుతుందని, ఇంత మొత్తం తమ వద్ద లేకపోవడంతో జిల్లా కార్మిక శాఖ అధికారులకు గోడు వినిపించారు. దీంతో స్పందించిన అధికారులు రమేష్ మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేశారు. అనంతరం మంగళవారం మృతదేహం గ్రామానికి రావడంతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. ఉపాధి కోసం వెళ్లిన యువకులు గత కొద్దికాలంగా ఇలా శవాలై ఇంటికి తిరిగి వస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి యువతకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

జీవన నావ..!



చెట్టు నుంచి జలధార..!



చెట్టుని నరుకుతుంటే జలధార వస్తున్న ఆశ్చర్యకర ఘటన కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కుర్డి గ్రామ పంచాయతీ జిరేన్‌పుట్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ గ్రామంలో దశాబ్దాల వయసు ఉన్నటువంటి ఒక పురాతన చెట్టును నరకడానికి గ్రామస్తుడు ప్రయత్నం చేశాడు. దీనిలో భాగంగా రంపంతో చెట్టును కోయడానికి ప్రయత్నం చేయగా, గాటుపడిన చోటు నుంచి భారీ ఎత్తున నీరు బయటకు ఉబికింది. నీరు ఏరులై ప్రవాహం కొనసాగింది. అక్కడే ఉన్న మరో యువకుడు ఈ అపురూప ఘటనను సెల్‌ఫోన్‌లో బంధించాడు. ఈ వీడియో వైరల్ అవ్వడంతో పర్యావరణ ప్రేమికులు పెద్ద ఎత్తున స్పందించారు. అవి నీరు కావని, ఆ చెట్టు కన్నీరని ఆవేదన వ్యక్తం చేశారు. – కొరాపుట్

ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న సీఎం మోహన్ చరణ్ మాఝి తదితరులు

భువనేశ్వర్: రాష్ట్రంలో కొనసాగుతున్న పలు జాతీయ రహదారులకు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమీక్షించారు. మంగళవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర నిర్మాణ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజాతో సహా పలువురు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు ఉన్నారు. జాతీయ రహదారి ప్రాజెక్టులకు మరింత ఊపునిచ్చే లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహించినట్లు అధికార వర్గాల సమాచారం. మూడు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం సాయంత్రం న్యూఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత రోడ్డు రవాణా, రహదారుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యమైన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి సంబంధించి నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)తో చర్చలు జరిపారు. అనంతరం ఒడిశా సంబంధిత సమస్యలపై చర్చించేందుకు ఆయన పలువురు కేంద్ర మంత్రులను కూడా కలిసే అవకాశం ఉంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా కొంతమంది బీజేపీ కేంద్ర నాయకులను కలుస్తారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. బుధవారం మధ్యాహ్నం భువనేశ్వర్‌కు ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణం కానున్నారు.

త్రిసభ్య కమిటీ దర్యాప్తు ప్రారంభం

- బలభద్ర స్వామి పొహండి ప్రమాదంపై విచారణ



బలభద్ర స్వామి పొహండి (ఫైల్)

భువనేశ్వర్: గుండిచా ఆలయంలోని అడపా మండపానికి రథం పైనుంచి దింపి తీసుకెళ్తుండగా బలభద్ర స్వామి మూల విరాటు పొహండి ప్రమాదంపై విచారణకు ఏర్పాటైన త్రిసభ్య కమిటీ మంగళవారం విచారణ ప్రారంభించింది. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఏడీఎం), అడ్మినిస్ట్రేటర్ (అభివృద్ధి) మరియు డీఎస్పీ స్థాయి అధికారితో కూడిన కమిటీ వివిధ వ్యక్తులను ప్రశ్నించడం ప్రారంభించింది. వీరిలో బలభద్ర స్వామి మూల విరాటు ప్రధాన అంగ రక్షకుడు హలధర్ దాస్ మహాపాత్రో కుమారుడు అనాథ్ హలధర్ దాస్ మహాపాత్రో ఉన్నారు. త్రిసభ్య కమిటీ తన విచారణలో భాగంగా ఖుంటియా సేవకులు, ప్రతిహారి సేవకులు, శ్రీజగన్నాథ ఆలయ అధికారులు (ఎస్‌జేటీఏ) అధికారులు మరియు సీనియర్ దైతపతి సేవకులను కూడా విచారించింది. విచారణలో భాగంగా శ్రీమందిర్ ప్రధాన పాలన అధికారి(సీఏఓ) అరబింద పాఢీ వర్చువల్‌గా హాజరయ్యారు.

ఇదీ విషయం...

జూలై 9న పొహండి జరుగుతుండగా రథం నుంచి విగ్రహాన్ని బయటకు తీస్తున్నప్పుడు బలభద్ర భగవానుడి పవిత్ర విగ్రహం అతని రథం చారు మళ్ల (రాంప్)పై పడింది. ఈ ఘటనలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న 7 మంది సిబ్బంది గాయపడ్డారు. గుండిచా ఆలయానికి తీసుకెళ్లేందుకు బరువైన దారు విగ్రహాన్ని కిందకు దించుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనపై సర్వత్రా విచారం వ్యక్తమైంది. ప్రభుత్వం విమర్శలకు గురైంది. దీంతో విచారణ కమిటీని ఏర్పాటు చేసి, ఘటనకు కారణాలను గుర్తించి బాధ్యులను గుర్తించే బాధ్యతను కమిటీకి ప్రభుత్వం అప్పగించింది. అనధికార వ్యక్తులు మరియు సేవకులు చొరబడడంతో రథాలపై కిక్కిరిసిన పరిస్థితే సంఘటనకు దారితీసిందనే ఆరోపణలు వ్యాపించాయి. సాధారణంగా ఆ సమయంలో జగన్నాథుని రథంపై 50 మంది సేవకులు, దేవీ సుభద్ర రథంపై 10 మంది మరియు బలభద్ర భగవానుడి రథంపై 40 మంది సేవకులు అనుమతించబడతారు. అయితే ఆరోజు బలభద్ర భగవానుడి రథంపై కనీసం 100 మంది సేవకులు ఉన్నారని ప్రత్యక్ష సాక్షుల కథనం దుమారం రేపింది. విచారణ కోసం కమిటీని జూలై 10న ఏర్పాటు చేసి, నివేదికను జూలై 29లోగా సమర్పించాలని కోరిన విషయం తెలిసిందే.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొరాపుట్: జిల్లాలో నందపూర్ సమితి కేంద్రంలోని బస్ షెల్టర్ వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. బస్ షెల్టర్‌లో నిద్రపోయిన వ్యక్తి లేవకపోవడంతో స్థానికులు పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముందురోజు రాత్రి వచ్చి అక్కడ నిద్రపోయి, నిద్రలోనే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి సుమారు 30 ఏళ్లు ఉంటాయి. నల్లని టీ షర్టు, నీలం ప్యాంటు వేసుకొని ఉన్నాడు. స్థానికులు అతడిని ఈ ప్రాంతంలో ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు.



గుర్తు తెలియని మృతదేహం

ఉప ఎన్నికల తేదీ ప్రకటన

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా పలు పంచాయతీ సమితుల్లో ఖాళీగా ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్ల పోస్టుల భర్తీకి ఉప ఎన్నికల తేదీని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) మంగళవారం ప్రకటించింది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఉత్తర్వు ప్రకారం ఉప ఎన్నికలు ఈ ఏడాది ఆగస్టు 22న మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు జరుగుతాయి. 6 చైర్మన్, 1 వైస్ చైర్మన్ స్థానంతో సహా మొత్తం 7 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గంజాం జిల్లాలోని కవిసూర్యనగర్, ఖల్లికోట్, కుకుడాఖండి, కలహండి జిల్లాలోని నొర్లా, నవరంగ్‌పూర్ జిల్లాలో రాయ్‌ఘడ్, నయాగఢ్ జిల్లాలోని భాపూర్‌లో చైర్మన్ పదవులు ఖాళీగా ఉన్నాయి. అలాగే బౌద్ జిల్లాలో హరభంగా పంచాయతీ సమితిలో వైస్ చైర్మన్ పదవి కూడా ఖాళీగా ఉంది. వీటి భర్తీ కోసం ఉప ఎన్నికకు ప్రకటనల జారీ అయ్యింది.

మరణ మృదంగం

- నబరంగ్‌పూర్‌లో కోరలుచాచిన అతిసారం
- ఇప్పటికే ముగ్గురు మృతి
- వైద్యానికి మంత్రగత్తెలను ఆశ్రయిస్తున్న వైనం



కొరాపుట్: ఇంటి వద్దే చికిత్స అందజేస్తున్న దృశ్యం



కొరాపుట్: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో అతిసారం విజృంభిస్తోంది. దాదాపు 45 రోజుల పాటు వర్షాలు కురవడంతో కోరలుచాచి మరణ మృదంగం మోగిస్తోంది. నందాహండి సమితి జడబందుగూడ పంచాయతీ దండసేనగుడ గ్రామంలో ముగ్గురిని బలి తీసుకుంది. ఈనెల 9వ తేదీన దాము అమ్నత్య కుమార్తె జానకీ అమ్నత్య(17) నబరంగ్‌పూర్ అస్పత్రిలో చికిత్స పొందుతూ, ఆస్పత్రి సిబ్బందికి తెలియకుండా ఇంటికి వచ్చి మృతి చెందింది. మర్నాడు నర్సింహ నాయక్ (28) అనే వ్యక్తి ఆస్పత్రిలో మృతి చెందాడు. తాజాగా మంగళవారం తులసి అమ్నత్య(60) అనే వృద్ధురాలి అతిసారంతో దుర్మరణం చెందింది. దీంతో వైద్య బృందం ఉలిక్కిపడి ఆ గ్రామానికి పరుగులు పెట్టింది. దీనిలో భాగంగా గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. గ్రామస్తులు వినియోగిస్తున్న తాగునీటిని పరీక్షల కోసం పంపించారు. అలాగే మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో ఇంటి వద్దనే చికిత్స అందజేస్తున్నారు.

చేతబడి అనుమానంతో పూజలు

ఆధునిక వైద్యానికి ఇష్టపడని గ్రామస్తులు మంత్రగత్తెలను ఆశ్రయించి పూజలు చేయించుకుంటున్నారని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఆస్పత్రికి వెళ్లినవారిలో ఇద్దరు మృతి చెందడంతో ఈ పుకార్లు వ్యాపించాయి. దీంతో గిరిజనులు ఇది చేతబడిగా అనుమానించి గుప్త పూజలు చేయించుకుంటున్నారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది చేసే వైద్యం పట్టించుకోవడం లేదు. అయినప్పటికీ గ్రామంలో బ్లీచింగ్ చల్లుతున్నారు. మైకులలో వేడినీరు తాగమని ప్రచారం చేస్తున్నారు. చివరికి గత్యంతరం లేక బాధితులకు ఇంటి వద్దనే వైద్యం చేయిస్తున్నారు. బాధితులు ఆస్పత్రికి వచ్చేదిలేదని మొండికేయడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. తాము ఎంత మొత్తుకున్నా గిరిజనులు తమ మాట వినడం లేదని అదనపు జిల్లా వైద్యాధికారి నవ కిషోర్ బెహరా వాపోయారు.

దిబలపాడులోనూ విజృంభణ

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీలోని దిబలపాడు గ్రామంలో అతిసారం వ్యాపించింది. సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో రెండు వందల మందికి పైగా జనాభ నివసిస్తున్నారు. గ్రామంలో ఉన్నటువంటి రెండు బోరుబావుల నుంచి వచ్చే కలుషితమైన నీటిని తాగడంతోనే ఈ పరిస్థితి దాపురించిందని సమాచారం. అయితే వ్యాధి బారినపడినవారు ఇంటి వద్దనే ఉంటూ సమీపంలోని ప్రైవేట్ క్లీనిక్‌లపై ఆధాపడి చికిత్స చేసుకుంటున్నట్లు సమాచారం. దీంతో జిల్లా ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు కల్యాణ సింగుపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్యరంజన్ జెన్న నేతృత్వంలో ఒక వైద్య బృందం మంగళవారం గ్రామానికి చేరుకుంది. గ్రామంలో అతిసారంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించింది. కలుషితమైన నీటిని తాగవద్దని, కాచి చల్లార్చిన నీటిని తాగాలను సూచించారు. ఎటువంటి అనారోగ్యం వచ్చినా డాక్టర్లను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం వ్యాధి అదుపులోనే ఉందని పేర్కొన్నారు.



కొరాపుట్: అతిసారంతో ఇళ్ల ముందు పడి ఉన్న గిరిజనులు



కొరాపుట్: నిర్మానుష్యంగా ఉన్న బాధిత గ్రామం



రాయగడ: అతిసారంతో మంచం పట్టిన యువకుడు



రాయగడ: అతిసారంతో బాధపడుతున్న యువతి



రాయగడ: గ్రామంలో చికిత్స అందిస్తున్న వైద్య బృందం

క్లుప్తంగా

జీసీఎంఎస్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ



యాప్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఒడిశా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలను అందించాలని కృతనిశ్చయంతో ఉంది. విద్యుత్ చెల్లింపులను పారదర్శకతతో సులభతరం చేయడానికి నైపుణ్య నిర్వహణకు రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థ టాటా పవర్ ఒడిశా తరఫున ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్‌దేవ్ ప్రభుత్వ వినియోగదారుల నిర్వహణ వ్యవస్థ (జీసీఎంఎస్) అత్యాధునిక వెబ్ పోర్టల్ మరియు మొబైల్ యాప్‌ని మంగళవారం ప్రారంభించారు.

ఆర్అండ్‌బీ మాజీ చీఫ్ ఇంజినీర్ అరెస్టు



భువనేశ్వర్: ఆర్అండ్‌బీ మాజీ చీఫ్ ఇంజినీర్ తారా ప్రసాద్ మిశ్రాని విజిలెన్స్ వర్గాలు అరెస్టు చేశాయి. అక్రమ ఆర్జిత ఆస్తుల సోదాలో లెక్కా జమలేని విలువైన ఆస్తులను ధ్రువీకరించారు. తారా ప్రసాద్ మిశ్రా ఆస్తులపై జరిపిన దాడుల్లో రెండున్నర కిలోల బంగారం, 355 గ్రాముల వజ్రాభరణాలు, రూ.2.7 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, 10 ఫ్లాట్లు, 7 ఇళ్ల స్థలాలు విజిలెన్సు వర్గాలు గుర్తించారు.

సొరంగాల్లో బ్యాలస్ట్ రహిత ట్రాక్



బ్యాలస్ట్ రహిత రైలు మార్గం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే సొరంగాల్లో అధునాతన బ్యాలస్ట్ రహిత ట్రాక్ సాంకేతికతని అవలంబిస్తోంది. కొరాపుట్ - సింగపూర్ రోడ్డు డబ్లింగ్ ప్రాజెక్ట్‌లో ఈ సాంకేతికని ప్రయోగిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగమైన బైగూడ మరియు కాకిరిగుమ్మ స్టేషన్ల మధ్య 600 మీటర్ల పొడవైన సొరంగ మార్గంలో బ్యాలస్ట్ రహిత రైలు మార్గం నిర్మితం అవుతుంది. త్వరలో ఇది పూర్తి అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

అలుగు స్మగ్లింగ్ కేసులో శిక్ష

భువనేశ్వర్: వన్యప్రాణుల (రక్షణ) చట్టం -1972లోని సెక్షన్ 51 ప్రకారం ఇద్దరు వన్యప్రాణుల నేరస్తులను సోన్‌పూర్ సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీజేఎం) కోర్టు దోషులుగా నిర్ధారించింది. వారికి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష (ఆర్ఐ)తో పాటు రూ. 10,000 చొప్పున జరిమానా విధించింది. రాష్ట్రంలో అలుగు స్మగ్లింగు కేసులో నిందితులకు శిక్ష పడిన తొలి కేసు ఇదేనని స్పెషల్ టాస్కు ఫోర్సు (ఎస్‌టీఎఫ్) తెలిపింది.

ముఖ్యమంత్రిని కలిసిన ఖురానియా

భువనేశ్వర్: ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో సీనియర్ ఐపీఎస్ అధికారి వై.బి. ఖురానియా మంగళవారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఒడిశా భవన్‌లో వీరిరువురు సమావేశమయ్యారు. ఖురానియా తదుపరి రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ రేసులో ముందంజలో ఉన్నారు. ఇటీవల ఆయనను హుటాహుటిన కేంద్ర డిప్యుటేషన్ నుంచి తొలగించి రాష్ట్రానికి తరలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రితో ఆయన సమావేశం చర్చనీయాంశమైంది.

కళింగ పురస్కారం కొనసాగించాలి

భువనేశ్వర్: వైజ్ఞానిక రంగంలో ప్రతిష్ఠాత్మక యునెస్కో కళింగ పురస్కారం కొనసాగించాలని కోరుతూ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ వ్యక్తిగత జోక్యానికి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, విపక్ష నేత నవీన్ పట్నాయక్ లేఖ రాశారు. యునెస్కో కళింగ పురస్కారం విజ్ఞాన శాస్త్రాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు చేసిన కృషికి వైజ్ఞానికులకు ప్రదానం చేసే అంతర్జాతీయ పురస్కారం. 1952లో ప్రారంభమైనప్పటి నుంచి లూయిస్ డీ బ్రోగిల్, జూలియన్ హక్స్లీ, బెర్ట్రాండ్ రస్సెల్, కార్ల్ వాన్ ఫ్రిష్, ఆర్థర్ సి.క్లార్క్, ఫ్రెడ్ హోయెల్, సెర్గీ కపిట్జా వంటి 7 మంది నోబెల్ గ్రహీతలతో సహా ఇప్పటివరకు 72 మంది గొప్ప శాస్త్రవేత్తలకు ప్రదానం చేయబడింది. 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ, ఒడిశా ప్రభుత్వం మరియు కళింగ ఫౌండేషన్ ట్రస్ట్ ఈ బహుమతికి భాగస్వాములు, దాతలుగా వ్యవహరించాలని మరియు ఖర్చులను పంచుకోవాలని నిర్ణయించినట్లు నవీన్ పట్నాయక్ గుర్తు చేశారు. ఈ నిర్ణయం నిరవధికంగా కొనసాగించాలని లేఖలో అభ్యర్థించారు.

ప్రజాభిప్రాయంతోనే మార్గదర్శకాలు



- డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడ

భువనేశ్వర్: ప్రజాభిప్రాయంతోనే సుభద్ర యోజన మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నామని డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడ మంగళవారం ప్రకటించారు. సుభద్ర యోజన అనేది మహిళా సాధికారతకు ఉద్దేశించిన చారిత్రాత్మక చొరవ అని పేర్కొన్నారు. ఇది వారి జీవితాలను మార్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మార్గదర్శకాలు విడుదలయ్యేవరకు పథకం గురించి ఊహాగానాలు ప్రచారం చేయవద్దని అభ్యర్థించారు. దరఖాస్తు ప్రక్రియ నేరుగా ఎటువంటి అవాంతరాలు లేకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. మహిళలకు ఆర్థిక సాయం అందించడం ద్వారా స్వయం సమృద్ధి సాధించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ పథకం కోసం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసిందని తెలిపారు. దీనిని మరింత ప్రభావవంతంగా మరియు తప్పులు లేకుండా చేయడానికి వివిధ వర్గాల నుంచి అభిప్రాయాన్ని కోరుతున్నామన్నారు. ఈ పథకం ద్వారా వీలైనంత ఎక్కువ మంది మహిళలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే పలు మార్గదర్శకాలు ఉన్నాయని, అయితే మరింత సమర్థవంతంగా చేయడానికి ప్రభుత్వం ప్రజల నుంచి సూచనలను కోరుతోందని వెల్లడించారు. ఈనెల 14 లోపు అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ఈ అభిప్రాయాలను పరిశీలించిన తర్వాత సుభద్ర పథకం అమలు, కార్యాచరణ సాధ్యాసాధ్యాలపై చర్చించనున్నట్లు మంత్రి తెలిపారు. అవసరమైతే సిద్ధంగా ఉన్న మార్గదర్శకాల్లో సవరణలు చేయడం జరుగుతుందన్నారు.

పథకానికి ఎంతోమంది దూరం: ప్రమీలా మల్లిక్

రాష్ట్రంలో చాలా మంది మహిళలు సుభద్ర పథకానికి దూరం కానున్నారని విపక్ష బిజూ జనతా దళ్ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ ఆరోపించారు. ఈ పథకం అమలు, కార్యాచరణ పురస్కరించుకుని కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రహసనమని ఆమె వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల్లో ఒకటైన పింఛను పెంపు అమలులో ప్రభుత్వం ఎంతో మందికి మొండిచేయి చూపింది. కొత్త ప్రామాణికాలు ముసుగులో ఈ మోసానికి పాల్పడిందన్నారు. అదే తరహాలో సుభద్ర పథకం కింద మహిళలకు నిరుత్సాహపరచనున్నారని హెచ్చరించారు.

ఉపాధ్యాయులను నియమించాలని ఆందోళన



పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం



ఆందోళన చేస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న బీఈవో చందన కుమార్ నాయిక్

జయపురం: స్థానిక ఇరిగేషన్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని, లేకపోతే పాఠశాలకు తాళాలు వేస్తామని పేరెంట్స్‌తో పాటు ఆ ప్రాంత ప్రజలు సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఈ మేరకు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. 179 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలకు ఉపాధ్యాయులు లేరనే నెపంతో సెలవులు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమిస్తే పిల్లల చదువులు సాగవని, వారి భవిష్యత్ అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ విభాగ యాజమాన్యంలో పాఠశాల నడుస్తుండడం వలన విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టుకు ప్రభుత్వం ఎయిడ్ తగ్గించడం వలన యాజమాన్యం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం లేదని వాపోయారు. డిప్యుటేషన్‌పై వచ్చిన టీచర్లు కేవలం 8వ తరగతికి మాత్రమే పాఠాలు బోధిస్తున్నారని, 9, 10 తరగతుల విద్యార్థులకు బోధించేవారే లేరని ధ్వజమెత్తారు. ఉన్న ఇద్దరు టీచర్లు మూడు నెలల్లో రిటైర్ అవుతారని, అందువలన కొత్త ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆందోళనకు దిగిన ప్రజలతో జయపురం బ్లాక్ విద్యాధికారి చందన కుమార్ నాయిక్ చర్చించారు. త్వరలోనే ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నవీన్‌ను కలిసిన నబరంగ్‌పూర్ కార్యకర్తలు



కార్యకర్తలతో మాట్లాడుతున్న నవీన్ పట్నాయక్

కొరాపుట్: బిజూ జనతాదళ్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన ఆ పార్టీ కార్యకర్తలు కలుసుకున్నారు. రాష్ట్ర రాజధానిలో నవీన్ నివాస్‌కి మంగళవారం తరలివెళ్లారు. ఎన్నికల్లో పరాజయం తర్వాత తమ నాయకుడిని కలిసి సమస్యలను వివరించారు. నవీన్ స్పందిస్తూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రజలతో కలిసి ఉండాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా పరిషత్ వరకు పదవుల్లో బీజేడీ వారే ఉన్నారని కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని నవీన్ వారికి నిర్దేశించారు. కార్యకర్తల వెంట పార్టీ నబరంగ్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్ర మఝి, దాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారిలు ఉన్నారు.

న్యాయవాదులకు నివాళులు



నివాళులర్పిస్తున్న దృశ్యం

జయపురం: ఇటీవల మృతి చెందిన ఇద్దరు న్యాయవాదులకు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం నివాళులర్పించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ సభాగృహంలో దివంగత న్యాయవాదులు సరోజ్ కుమార్ భొత్ర, కృష్ణ ప్రేమ్ నాయిక్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శశాంక మిశ్ర, మదన మోహన్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు ఎమ్మెల్యే హామీ



అల్లాడ గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి అల్లడ గ్రామ పంచాయతీలో సాగునీరు అందక రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. సోలార్ విద్యుత్ శక్తితో పనిచేస్తున్న పథకం మూలనపడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి పథకాన్ని మంగళవారం పరిశీలించారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఇంజినీర్లతో మాట్లాడి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు అల్లడ పంచాయతీ నాయకులు, అధికారులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్

కొరాపుట్: దేశ రాజధానిలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన బాలలు పయనమయ్యారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో ప్లస్ 2 సైన్స్ చదువుతున్న సిత్తి లగ్న సత్పతి, లమ్తాపుట్ సమితి గొడిమంజర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సుభాస్ కిలోలు ఈ అవకాశం చేజిక్కించుకున్నారు. కేంద్ర విద్యాశాఖ ఆహ్వానం మేరకు రాష్ట్రం నుంచి వీరిద్దరికే ఈ అవకాశం దక్కింది. వీరిని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ తన వద్దకు పిలిపించుకొని అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఖర్చులతో ఢిల్లీ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసి వీడ్కోలు పలికారు. గత వేసవి సెలవుల్లో ఎన్‌సీఈఆర్‌టీ దేశవ్యాప్తంగా బాలలకు విజ్ఞాన పరీక్షలు పెట్టింది. అందులో రాష్ట్రం నుంచి వీరిద్దరూ ఎంపికయ్యారు. దీంతో వీరిని వారం రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలో వైజ్ఞానిక యాత్రకి పంపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరలా వీరిద్దరికీ ఢిల్లి వెళ్లే అవకాశం కల్పించింది.

అధ్యక్షుడిగా మనోజ్ ఆహుజా



భువనేశ్వర్: శ్రీజగన్నాథ ఆలయ పాలక మండలి కార్యనిర్వాహక అధ్యక్షునిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ మనోజ్ ఆహుజా నియమితులయ్యారు. పాలక మండలి అధ్యక్షుడిగా పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ కొనసాగుతున్నారు. శ్రీజగన్నాథ ఆలయం ప్రధాన పాలన అధికారి (సీఏవో), పూరీ కలెక్టర్ మరియు పోలీసు సూపరింటెండెంట్, భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) సూపరింటెండెంట్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా మరియు 12 మంది ఇతర సభ్యులు ఉన్నారు. ఈ కమిటీ పూరీలోని శ్రీజగన్నాథ ఆలయం నిర్వహణ మరియు పాలన వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలు



గాయపడిన విద్యార్థిని నతుల మాడీ

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కాలేజీ వద్ద మంగళవారం మధ్యాహ్నం ఒక గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో వెనుకనుంచి ఢీకొనడంతో విద్యార్థిని నతుల మాడీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే విద్యార్థిని స్పృహతప్పి పడిపోయింది. దీంతో స్థానికులు మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి తలకు బలమైన గాయమైందని తెలియజేశారు. ఈ విషయం తెలియడంతో బాలిక చికిత్స నిమిత్తం రెడ్‌క్రాస్ నుంచి కలెక్టర్ నిధులు కేటాయించారు. ఉన్నత చికిత్స కోసం కొరపుట్ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

జయపురం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్ఎం ప్రశాంత పట్నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిశా ముక్త భారత్ అభిజాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దేశం ప్రగతి పథంలో పయనించాలంటే నిశాముక్త భారత్ అభిజాన్ విజయవంతం కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ ధనీమా హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి చెవిదిద్దులు చోరీ



బాధితురాలు మానిక్ సాబొరా

రాయగడ: వృద్ధురాలి చెవిదిద్దులు తెంపుకుని వెళ్లిన యువతీ, యువకుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన జిల్లాలోని గుడారిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుడారి పోలీస్‌స్టేషన్ పరిధి డెరిగాగుడ గ్రామానికి చెందిన మానిక్ సాబొరా(75) అనే వృద్ధ మహిళ ఏదో పనిమీద పొరుగు గ్రామమైన నయిరాగుడకు సోమవారం వెళ్లింది. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి నడుచుకుని వస్తున్న సమయంలో నయిరాగుడ సమీపంలో ఒక యువతీ, యువకుడు బైకుపై వచ్చి వృద్ధురాలి చెవిలో బంగారు దిద్దులతో పాటు మెడలో ఉన్నటువంటి వెండి గొలుసును తెంపుకుని పారిపోయారు. వెంటనే ఆమె కేకలు వేయడంతో అక్కడ ఉన్న వారు దొంగలను పట్టుకునే ప్రయత్నం చేశారు. సారుపాడు గ్రామం మీదుగా వారు వెళ్తున్నట్లు తెలుసుకున్న గ్రామస్తులు ఆ గ్రామంలోని కొందరికి ఈ విషయం చెప్పారు. దీంతో సారుపాడులో కాపుకాసిన గ్రామస్తులు బైకుపై వెళ్లిన యువతీ, యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దొంగల వివరాలు తెలియాల్సి ఉంది.

భాంగ్ మత్తు పదార్థమే

భువనేశ్వర్: ఒడిశా ప్రభుత్వం ఇప్పుడు భాంగ్‌ను మత్తు పదార్థంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ మంగళవారం అధికారంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

చర్చలు ఫలప్రదం

రహదారి	పొడవు (కిలో మీటర్లు)	వ్యయ ప్రణాళిక (రూ.కోట్లలో)
చండీఖోల్ - బొడొబిలా	200	10,000
భువనేశ్వర్ - పూరీ	60 (6 లేన్లు)	18,000
ఖుర్దా - నయాగడ్	54 (4 లేన్లు)	1,100
కెసింగా - జునాగడ్	47 (4 లేన్లు)	1,000

భువనేశ్వర్: న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన జాతీయ రహదారి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో చర్చలు ఫలప్రదం అయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలకు కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ ఆమోద ముద్ర వేసినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 4 జాతీయ రహదారి ప్రాజెక్టులు అమలు చేసేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ జాబితాలో భువనేశ్వర్ నుంచి పూరీ, చండీఖోల్ నుంచి బొడొబిలా, ఖుర్దా నుంచి నయాగడ్, కెసింగా నుంచి జునాగడ్ జాతీయ రహదారి ప్రాజెక్టులు చోటు చేసుకున్నాయి. భువనేశ్వర్ నుంచి పూరీకి సర్వీస్ రోడ్డు ఉంటుంది. సర్వీస్ రోడ్డుతో పాటు రోడ్డును 6 లేన్లుగా తీర్చిదిద్దనున్నారు. చండీఖోల్ నుంచి బొడొబిలా 8 లేన్ల రహదారిగా విస్తరించబడుతుంది. 4 లేన్లతో ఖుర్దా-నయాగడ్ మరియు కెసింగా - జునాగడ్ జాతీయ రహదారిగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

ఇదేం రోగం..!

- మహిళా రోగులపై డాక్టర్ లైంగిక వేధింపులు
- త్రిసభ్య కమిటీ విచారణకు ఆదేశాలు

భువనేశ్వర్: కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగంలో లైంగిక వేధింపుల ఆరోపణలు కలకలం రేపాయి. ఈ విభాగానికి చెందిన ఒక డాక్టర్ ఇద్దరు మహిళా రోగులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణ. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఒడిశా డీఎంఈటీ ప్రొఫెసర్ డా.సంతోష్ కుమార్ మిశ్రా, కటక్ ఎస్‌సీబీఎంసీహెచ్ సూపరింటెండెంట్ డా.సుధాంశు శేఖర్ మిశ్రా, కటక్ ఎస్‌సీబీఎంసీహెచ్ డీన్ మరియు ప్రిన్సిపాల్ డా.రోమా రతన్‌లు దర్యాప్తు కమిటీ సభ్యులుగా నియమితులైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆరోపణలపై కమిటీ విచారణ జరిపి తగిన చర్యలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని ఈ ఉత్తర్వులు పేర్కొన్నాయి. బాధిత రోగుల బంధువులు స్థానిక మంగళబూాబాగ్ ఠాణాలో ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్‌పై బంధువుల దాడి

మరోవైపు రోగుల బంధువులు నిందిత డాక్టర్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రస్తుతం డాక్టర్ కూడా గాయాలతో అదే ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన ఆదివారం జరగ్గా, సోమవారం ఫిర్యాదు అందిందని కటక్ అదనపు డీసీపీ అనిల్ మిశ్రా తెలిపారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నామని, బాధితుల వాంగ్మూలం నమోదు చేస్తామని పేర్కొన్నారు. కాగా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను ఎస్‌సీబీ ఎంసీహెచ్ కార్డియాలజీ విభాగంలో సీనియర్ రెసిడెంట్ డాక్టర్ ఠాకూర్ దిల్‌బార్ సింగ్‌గా గుర్తించారు.

దేశం మనదే.. తేజం మనదే



రాయగడ: 77 అడుగుల జెండాతో ఊరేగింపులో పాల్గొన్న విద్యార్థులు

స్వాతంత్య్ర వేడుకలకు రాష్ట్రం సన్నద్ధమవుతోంది. గురువారం జరగనున్న వేడుకల కోసం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ఊపందుకుంది. పలుచోట్ల మూడు రంగుల జెండాలతో ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ప్రతి ఒక్కరి ఇంటిపై జాతీయ జెండా ఎగురువేయాలని ప్రముఖులు పిలుపునిస్తున్నారు. పోస్టాఫీసుల్లో జాతీయ జెండాను రూ.25 అందుబాటులో ఉంచారు.

- సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: ఉమ్మర్‌కోట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి నిత్యానంద గొండో తదితరులు



మల్కన్‌గిరి: జాతీయ జెండాలతో అధికారులు



కొరాపుట్: స్వాతంత్య్ర సమరయోధుడు బగ్గో పూజారికి నివాళులర్పిస్తున్న మంత్రి నిత్యానంద



పర్లాకిమిడి: పట్టణంలో త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



మల్కన్‌గిరి: మారథాన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి



కొరాపుట్: రాయిఘర్‌లో బెంగాలీ శరణార్థుల ర్యాలీ



పర్లాకిమిడి: జాతీయ జెండాలతో విద్యార్థినుల ర్యాలీ



పర్లాకిమిడి: దేశభక్తి పాటలకు కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ప్రదర్శన



కొరాపుట్: నారాయణపట్నలో విద్యార్థినుల ర్యాలీ



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ పట్వారి తదితరులు

క్లుప్తంగా

గ్రావెల్ తవ్వకాలపై పరిశీలన



బురుజోల మెట్టపై గ్రావెల్ తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు బృందం

సాక్షి ఎఫెక్ట్...

భామిని: 'పచ్చదనం కనుమరుగు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం పట్ల అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా అధికారుల ఆదేశాలతో భామిని మండలం బురుజోల మెట్టపై గ్రావెల్ అక్రమ తవ్వకాలను తహసీల్దార్ ఆర్.ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఎంఆర్ఐ ఎస్.రాంబాబు, వీఆర్ఓ జి.వెంకటరమణల బృందం బురుజోల మెట్టను సందర్శించి అక్రమంగా తవ్విన గ్రావెల్ గోతులను పరిశీలించారు. బురుజోల మెట్టపై అక్రమ గ్రావెల్ తవ్వకాలతో పచ్చదనం కనిపించకుండా పోతున్నట్లు గుర్తించారు. మెట్టను సందర్శించే సమయానికి తవ్వకాలు జరగడం లేదని, గ్రావెల్ తవ్వకానికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ స్పష్టం చేశారు.

అర్ధరాత్రి తిరిగితే కేసులు తప్పవు

- నేరాల నియంత్రణకు రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌లో మార్పులు
- నిరంతరం కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ
- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో సహేతుక కారణం లేకుండా అర్ధరాత్రి బహిరంగంగా తిరిగితే వారిపై కేసులు నమోదుచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాత్రి 11 గంటల తర్వాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు, మూసేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, సహేతుకమైన కారణం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా వారిపై కేసులు నమోదుచేయడంతో పాటు, వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి, కౌన్సె లింగ్ నిర్వహించాలని చెప్పారు. సహేతుకరమైన కారణం లేకుండా పట్టణాల్లో మూడురోజులుగా సంచరిస్తున్న 121 మందిపై పోలీసులు కేసులు నమోదుచేసి, వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రాత్రి గస్తీలో మార్పులు

నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటివరకూ నిర్వహిస్తున్న రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌లో మౌలికమైన మార్పులను చేపట్టారు. రాత్రి విధులకు వెళ్లే పోలీసు సిబ్బందితో సంబంధిత పోలీసు అధికారులు సమావేశమై, రాత్రి గస్తీలో వారు నిర్వహించాల్సిన విధులు పట్ల దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ఆయా బీట్ల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, పాయింట్ పుస్తకాలు గల ప్రాంతాలను తప్పనిసరిగా సందర్శించే విధంగా చర్యలు చేపట్టారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పెట్రోలింగ్ తిరిగే వాహనాలను, బీట్ పర్యవేక్షణ అధికారులను నిరంతరం రాత్రుళ్లు అప్రమత్తం చేయాలని పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్


విజయనగరం టౌన్: ఈ నెల 8న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పెందుర్తికి చెందిన భార్యాభర్తలపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తికి చెందిన భార్యాభర్తలు విజయనగరం రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడి నుంచి పెందుర్తి వెళ్లేందుకు వేరే ట్రైన్ లేనందున రైల్వేస్టేషన్ నుంచి బయటకు వచ్చి టీ తాగుదామని వేచి ఉన్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారి వద్దకు వచ్చి, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, అడ్డు వచ్చిన భర్తను దారుణంగా కొట్టి హత్యాయత్నానికి పాలపడ్డారు. ఆ సమయంలో భార్యభర్తలు చాకచక్యంగా తప్పించుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కలెక్టరేట్ సమీపంలో ఎస్సీ కాలనీకి చెందిన కోరాడ దండు అలియాస్ దండురాజు, కంటోన్మెంట్‌కు చెందిన బొగ్గు సూరి, అలియాస్ సూర్యలను అరెస్ట్ చేశారు. కేసులో నిందితులు ఉపయోగించిన కర్రను, చాకును సీజ్ చేశారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

సస్యరక్షణతో రెట్టింపు దిగుబడులు


- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, శ్రీనివాస్

రామభద్రపురం: పంటను ఆశించిన చీడపీడలను సకాలంలో గుర్తించి నివారించడంతో పాటు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే రెట్టింపు దిగుబడులు వస్తాయని విజయనగరం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నాయుడువలసలో మొక్కజొన్న, పత్తి పంటలను మంగళవారం పరిశీలించారు. ఎండు తెగులు నివారణ చర్యలను వివరించారు. పురుగు మందుల పిచికారీ, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సంధ్యారాణి, చిట్టిబాబు, వీఏఏ డబ్ల్యూ.ఎస్.శర్మ పాల్గొన్నారు.

నాటి గుర్తులు.. నేటికీ పదిలం



- స్వాతంత్య్రోద్యమంలో సాలూరు వాసులు
- ప్రథమ శాసనసభ్యుడు స్వాతంత్య్రసమరయోధుడే



సాలూరులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న వెంకటనారాయణ దొర (ఫైల్)



ఇందిరాగాంధీతో కూనిశెట్టి వెంకటనారాయణ దొర(ఫైల్)

సాలూరు: భరతమాత దాంస్య శృంఖలాలను తెంచేందుకు ఎందరో మహానుభావులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేశారు. ఈ నేపథ్యంలో భారతదేశ స్వాతంత్య్ర సంగ్రామంలో సాలూరుకు చెందిన యోధులు అలుపెరగని పోరాటంలో పాల్గొన్నారు. ఆనాటి స్వాతంత్య్ర సమర యోధుల్లో సాలూరుకు చెందిన కూనిశెట్టి వెంకటనారాయణదొర, బెంజిమన్ ఫ్రాంక్లిన్, దారాముక్కల యగ్నేశ్వరశర్మ తదితరులు ఉన్నారు. భారతదేశానికి స్వాత్రంత్య కాంక్ష ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న ఆ రోజుల్లో సాలూరు సెంటర్‌లో వందేమాతర నినాదాలు చేస్తున్న యువకుడైన నారాయణదొరపై ఆంగ్లేయులు విచక్షణారహితంగా లాఠీలతో కొట్టినా తన వందేమాతర నినాదాన్ని ఆయన వదల్లేదు. చివరకు ఆయనను బరంపురం సి–క్లాసు జైలుకు తరలించి కఠిన కారాగార శిక్ష విధించారు. సుమారు ఏడాదిన్నర పాటు జైలు జీవితాన్ని ఆయన అనుభవించారు. ఎన్నో పోరాటాలు త్యాగాల ఫలితంగా భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం రాగా సాలూరు ప్రజలంతా తమ నాయకుడిగా భావించిన యువకుడైన నారాయణదొరను ఊరంతా గుర్రంపై ఊరేగించారు. తమ ప్రియతమ నాయకుడిని సాలూరు గాంధీగా పిలుచుకున్నారు. సాలూరులో తొలి జాతీయజెండాను నారాయణదొర ఎగురవేసి భారత స్వాత్రంత్య సంగ్రామంలో సాలూరు ఖ్యాతిని చాటి చెప్పారు. అనంతరం 1952లో దేశవ్యాప్తంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆచార్య ఎన్‌జీ రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ తరపున అఖండ మెజారిటీతో సాలూరు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు.

నాటి నిర్ణయాల నేటి గుర్తులు

- నాడు జరిగిన స్వాతంత్య్రపోరాటాలకు ఆనవాళ్లుగా నేటికీ సాలూరు పట్టణంలోని పలు ప్రాంతాలు నిలుస్తున్నాయి. భారత స్వాతంత్య్ర సాధనలో భాగంగా ఆంగ్లేయుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ దేశనాయకులు ఇచ్చిన పిలుపుపై స్థానిక నాయకులు, ప్రజలు అర్ధరాత్రి వేళ సమావేశాలను ప్రస్తుత పెదబజారులోని గాంధీపార్కు వద్ద ఉన్న మర్రి చెట్టు కింద నిర్వహించేవారు.
- దేశానికి స్వాతంత్య్రం ప్రకటించిన నేపథ్యంలో సగర్వంగా మన జాతీయ పతాకాన్ని ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోనే ఎగురవేశారు.

15వ ఏట స్వాతంత్య్ర సమరంలోకి



కూనిశెట్టి వెంకట నారాయణ దొర(ఫైల్)

1907 జూలై 4న కూనిశెట్టి యరకన్న దొర, సాయమ్మలకు తొలిసంతానంగా వెంకటనారాయణదొర జన్మించారు. విలాసవంతమైన కుటుంబ నేపథ్యంలో జన్మించినప్పటికీ, భారత స్వాతంత్య్ర సమరంలో ఇంటికో యోధుడిని తయారుచేసి దేశానికి అంకితం చేయాలని దేశప్రజలు సంకల్పించిన రోజులలో తన 15వ ఏట స్వాతంత్య్ర సమరంలోకి నారాయణదొర అడుగులు పడ్డాయి.

కొన్ని సంఘటనలు

- సహాయనిరాకరణ ఉద్యమంలో భాగంగా కల్లు, సారా వేలం పాటలు జరగకుండా 1922లో సాలూరులో నారాయణదొర ఉద్యమించారు. విదేశీవస్తు బహిష్కరణకు తోడ్పడ్డారు.
- "1930లో విశాఖపట్నంలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు 6 నెలలు కఠిన కారాగార శిక్ష అనుభవించారు.
- "1932లో గుంటూరులో గాంధిజీ శిష్యురాలు వేదాంతం కమలాదేవి అధ్యక్షతన జరిగిన స్వాతంత్య్ర పోరాట సమావేశంలో దొర ప్రముఖ పాత్ర వహించినందుకుగాను బ్రిటిష్ పాలకులు అరెస్ట్ చేశారు.
- 1936 నవంబరు 14న ఓ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ ప్రాణాలను నారాయణ దొర కాపాడారు.
- "1937లో సాలూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వందేమాతర నినాదాలతో హోరేత్తిస్తూ ప్రజలను దేశభక్తి వైపు ప్రభావితం చేస్తున్నందుకు ఆనాటి పార్వతీపురం డీఎస్పీ హోమిల్టన్ దొర విచక్షణారహితంగా నారాయణదొరను లాఠీలతో కొటించ్చి అరెస్ట్ చేసి బరంపురం జైలుకు తరలించారు. ఏడాదిన్నర బందీగా ఉన్నారు.
- 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమానికి సాలూరు తరపున నారాయణ దొర నాయకత్వం వహించారు.
- ఇలాఅనేక ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొని భారతదేశానికి స్వాతంత్ర సాధనకు నారాయణదొర తనవంతు విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం స్వాతంత్రానంతరం తామ్రపత్రంతో ఆయనను సత్కరించింది.
- సాలూరు నియోజకవర్గ తొలి శాసనసభ్యుడిగా ఎన్నికైన తరువాత సాలూరు ప్రజలకు అనేక మంచి కార్యక్రమాలు చేసి నిస్వార్థ రాజకీయాలును చేసి ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.



స్వాత్రంత్య్ర సమావేశాలకు నిలయమైన మర్రి చెట్టు (ఫైల్)

మెయిన్‌రోడ్డుగుండా భారీ ర్యాలీ చేశారు.

విశాఖపట్నం రాజధానిపై నాడు తీర్మానం

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్ర విభజన సమయంలో విశాఖపట్నం రాజధాని చేయాలనే తీర్మానాన్ని కూనిశెట్టి వెంకటనారాయణ దొర తీసుకువచ్చారు. పలు రాజకీయ కారణాలతో నాడు ఈ తీర్మానం ఓటమి పాలవడంతో కర్నూలు రాజధానిగా నాడు ఏర్పాటైంది.

16 నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

- వివిధ జిల్లాల నుంచి హాజరుకానున్న 180 మంది క్రీడాకారులు
- 19న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం
- జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.నాయుడు

విజయనగరం:

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం వేదికగా రాష్ట స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.ఎ.నాయుడు మంగళవారం తెలిపారు. నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మొత్తం నాలుగు రోజుల పాటు సీనియర్స్ విభాగంలో స్త్రీ, పురుషులకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 180 మంది క్రీడాకారులు హాజరుకానుండగా... మొదటి రోజు 16న క్వాలిఫై పోటీల్లో క్రీడాకారులు తలపడతారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఈ నెల 17,18, 19 తేదీల్లో డీఎస్ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో రాష్ట స్థాయి పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. విజేతలకు ఈనెల 19న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు వచ్చే నెల 8 నుంచి 11వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న ఆల్ ఇండియా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో తలపడతారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపేవారిని బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తామని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయనగరంలో జరుగుతున్న పోటీలను జిల్లాలోని క్రీడాభిమానులంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నున్న సురేష్, వై.కుసుంబచ్చన్, పొట్నూరు శ్రీరాములు, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



శ్రావణి (ఫైల్)

లక్కవరపుకోట: కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన యువతి విశాఖపట్నంలో గల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై గోపాలరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్లేపల్లి గ్రామానికి చెందిన జామి శ్రావణి(19) ఈ నెల 5వ తేదీన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో పంటలకు వినియోగించే పురుగు మందు తాగేసింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి లక్ష్మి గమనించి అడగ్గా కడుపు నిప్పి తట్టుకోలేక పురుగు మందు తాగానని చెప్పడంతో హుటాహుటిన కొత్తవలస ఆస్పత్రికి తీసుకువెళ్లింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలో గల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. శ్రావనికి ఇటీవల కొత్తవలస మండలం అడ్డూరువానిపాలెం గ్రామానికి చెందిన యువకుడితో వివాహమైంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడిలో చోరీ



నగదు దోచుకుని వదిలిపెట్టిన హుండీలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపు పేట రాజబంగారమ్మ గుడిలో చోరీ జరిగింది. దీనిపై స్థానికులు మంగళవారం తెలిపిన వివరాలు ప్రకారం గ్రామ దేవత రాజబంగారమ్మ గుడి తలుపులు బద్దలుగొట్టి దొంగలు హుండీ ఎత్తుకెళ్లి నగదు దోచుకున్నారు. హుండీలో సుమారు రూ.50వేలు నగదు దొంగిలించి, మిగిలిన చిల్లర పైసాలతో బద్దల కొట్టిన హుండీనీ గుడి పక్కనే వదిలేశారు.

వాహనమిత్ర ఎప్పుడిస్తారు?



విలేకరుల సమావేశంలో సీఐటీయూ నాయకులు

- ఆటోవర్కర్స్ యూనియన్ డిమాండ్

విజయనగరం ఫూల్‌బాగ్: మహిళలకు ఉచిత బస్ పథకాన్ని స్వాగతిస్తున్నామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్ మోహన్ రావు, బి.రమణలు అన్నారు. అయితే ఈ పథకం అమలుకు సంవత్సరానికి రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసిన ప్రభుత్వం, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు కలిగే నష్టాన్ని ఎలా భర్తీ చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారం చేపట్టి 2 నెలలైనా వాహన మిత్రపై ఎలాంటి స్పష్టత లేదు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కు వాహనమిత్ర ఇవ్వాలి. కరోనా సమయం నుంచి ఆటో డ్రైవర్లపై ఉన్న కేసులు, ఫైన్లు, ఈ చలానాలు రద్దు చేయాలి. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి. ఆటో, వాహనాల కొనుగోళ్లు, స్పేర్ పార్ట్స్ తదితర వాటిపై 1 శాతం సెస్సు విధించి, ఆటో, రవాణా రంగ డ్రైవర్లు, వర్కర్లు, మెకానిక్‌ల నుంచి కొంత భాగాన్ని వసూలు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు మూతపడి ఉపాధి అవకాశాలు లేక చదువుకున్న ఆధునిక యువత స్వయం ఉపాధిగా ప్రజా, సరుకు రవాణా రంగాన్ని ఎంచుకుంటుందని, వాహనాల కొనుగోలుకు రుణ సదుపాయం లేక ప్రైవేట్ ఫైనాన్షియల్ దగ్గర బందీలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా స్టాండ్లలో ఉన్న ఆటోవాలాలు సరైన బేరాలు లేక ఇబ్బంది పడుతున్నారు. వారి పట్ల ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరించి అధిక ఫీజులు, పెనాల్టీలు, ఈ చలానాలు వసూలు చేస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు పథకంతో వారికి ఆదాయాలు మరింత తగ్గుతుందని, ఆ నష్టాన్ని ఎలా భర్తీ చేస్తారో ప్రభుత్వం చెప్పాలని కోరారు. ఈ సమస్యలపై ఆగస్టు 20వ తేదీ లోపు ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన లక్ష్మణరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామానికి చెందిన టి. లక్ష్మణరావు (54) పురుగు మందు మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో జరిగిన ఈ సంఘటనపై ఎస్సై రవీంద్ర రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మణరావు తన భర్యను హత్య చేసి జైలునుంచి బెయిల్‌పై వచ్చాడు. బంధువులు, గ్రామస్తులు తనతో ఎవరూ మాటాడడం లేదని మనస్తాపం చెంది పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

యువకుడి దుర్మరణం

- మరో యువకుడి పరిస్థితి విషమం
- లారీ, బైక్ ఢీకొనడంతో ప్రయాదం



కోండ్రు కరుణ (ఫైల్)

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనకు సంబంధించి గరివిడి ఎస్సై ఎల్.దామోదర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి డీఎఫ్ఎన్ ప్రాంతానికి చెందిన కోండ్రు కరుణ(26), రేవంత్, నూకరాజులు బైక్ మీద వెళ్తుండగా ఫేకర్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ, బైక్ ఢీకున్నాయి. దీంతో జరిగిన ప్రమాదంలో కోండ్రు కరుణ సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. మరో యువకుడు రేవంత్ తీవ్ర గాయాలతో పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. నూకరాజు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

మంచం మీద నుంచి జారిపడి



రామచంద్రరావు మృతదేహం

జామి: మండల కేంద్రం జామిలో ఎస్సీ కాలనీకి చెందిన కుంచంగి రామచంద్రరావు (37) ప్రమాదవశాత్తు మంచంపై నుంచి కింద పడి ఊపిరాడక మంగళవారం మృతిచెందాడు. తన ఇంటిలో మంచంపై పడుకుని పిల్లల కోసం కట్టిన ఉయ్యాలలో తలపెట్టి ఊగడంతో ఆకస్మాత్తుగా జారిపడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు జామి ఎస్సై వీరబాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసు నమోదు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధి అమ్మపాలెం గ్రామానికి చెందిన దేవాపురపు దేముడుపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీఎన్.మూర్తి తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. దేవాపురపు దేముడు తన భార్య రమణమ్మపై అనుమానంతో ఈనెల 11వ తేదీ రాత్రి ఆమెతో గొడవపడి 8గంటల సమయంలో తలపై కర్రతో కొట్టాడు. దీంతో రక్తస్రావమై ఆమె స్పృహ కోల్పోయింది. ఆమెను కుటుంసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ 12వ తేదీ రాత్రి చనిపోయింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు దేముడును రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పోలీసులు బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పనకు ఆదేశం

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోని సియోనువలస, చిన అక్కివలస, రామన్నదొరవలస, కృపావలస, దీవెనవలస గిరిజన గ్రామాల్లో సుమారు 60 కుటుంబాలు, దత్తిరాజేరు మండలం షికారుగంజి పంచాయతీ పరిధిలోని ఎస్.టి.కొత్తవలస గ్రామంలో 74 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామస్తుల విద్యుత్ సదుపాయం వినతి మేరకు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ తన చాంబర్లో మంగళవారం సమావేశమయ్యారు. ఆయా గ్రామాలు రిజర్వు ఫారెస్టు పరిధిలో ఉండడం వల్ల విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తంచేస్తోందని అధికారులు చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా గ్రామస్తులను ఒప్పించి వేరేచోట వారికి స్థలాలు కేటాయించి అన్ని వసతులూ సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఫారెస్ట్ ఆఫీసర్ వెంకటేష్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

జిల్లాలో ఈనెల 16 నుంచి ప్రారంభం కావాల్సిన రెవెన్యూ సదస్సులు తాత్కాలికంగా వాయిదా పడ్డాయని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. నోడల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, వీఆర్వోలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కొత్త షెడ్యూల్ వచ్చాక ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా సదస్సులు నిర్వహించాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందన్నారు. సదస్సుల నిర్వహణలో లోటుపాట్లు జరిగితే వీఆర్వోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.డి.అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, మండల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.